
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల జిల్లా వార్తలు 5

బుధవారం 8 అక్టోబరు 2025



## వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకం

**- మంత్రి ఎన్ఎండీ ఫరూక్**



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జీవితం స్ఫూర్తిదాయకమని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మంగళ వారం వాల్మీకి మహర్షి జయంతిని పుర స్కరించుకుని నంద్యాల ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్ర హానికి మంత్రి, వాల్మీకి సంఘాల నాయ కులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాల్మీకి ఆది కవిగా మానవజాతికి చిర స్మరణీయమైన రామాయణాన్ని రచిం చారని గుర్తు చేశారు. ఆయన జీవితం, ధర్మబోధనలలో నిగూఢమైన మాన వతా విలువలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. యువత వాల్మీకి మహర్షి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సం ఘాల నాయకులు గోవిందనాయుడు, బోయ రామకృష్ణ, కాశన్న, వెంకటేశ్వర్లు, గు ర్రప్ప, లాలు పాల్గొన్నారు.

## సాగర్‌కు 6 గేట్లతో నీటి కొనసాగింపు



శ్రీశైలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయం నుంచి సాగర్‌కు 6 గేట్ల ద్వారా నీటిని సాగనంపారు. వరద ప్రవాహం పెరగడంతో ఇంజనీర్లు స్పిల్ వే గుండా 1,68,174 క్యూసెక్కులు పంపి స్తున్నారు. ఎగువ జూరాల 77,462, విద్యుత్ ఉత్పత్తి 37,206, సుంకేసుల 8,892, హంద్రీ 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చిచేరింది. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి డ్యాం నీటి మట్టం 884 అడుగులు కాగా నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ఉత్పత్తి అనంతరం 65,640 క్యూసె క్కులు విడుదల చేశారు.

## దిగువ అహోబిలంలో ఘనంగా పవిత్రోత్సవం



అలంకరణలో ఉత్సవమూర్తులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 7(ఆంధ్ర జ్యోతి): దిగువ అహోబిలంలో 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదే శికన్ స్వామి ఆధ్వర్యంలో మంగళవారం పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించా రు. లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాల్ స్వామి పర్యవేక్ష ణలో విశేష పూజలు చేశారు. స్వామి వారికి పవిత్ర మాలలతో అలంకరించి హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ఆలయ పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

# కూటమి పావులు

- ఆత్మకూరు మున్సిపాలిటీపై కూటమి టార్గెట్
- ఇప్పటికే మొదలైన ఎన్నికల హడావుడి
- వార్డుల పునర్విభజనపై అధికార పార్టీ పట్టు




ఆత్మకూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపాలిటీలో అప్పుడే ఎన్నికల హడావుడి మొదలైంది. ఎలాగైనా ఈసారి మున్సి పాలిటీని చేజిక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎన్నికల్లో గెలిచి పీఠాన్ని దర్జాగా కైవసం చేసుకునేందుకు అంతర్గ తంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ముఖ్యంగా వార్డుల విభజన. వార్డుల విభజనతో వైసీపీ ఓటుబ్యాంకును కొల్లగొట్టేందుకు కూటమి నాయకులు కసరత్తు చేస్తున్నారు. మరో మూడు నెలల్లో మున్సిపల్ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. ఇప్పటినుంచే అభ్యర్థుల కోసం టీడీపీ శ్రేణులు దృష్టి సారించారు. వాస్తవానికి ఆత్మకూరు పట్టణం మొదటి నుంచి వైసీపీకి అను కూలంగా ఉంది. అంతేకాదు గత అసెంబ్లీ ఎన్ని కల్లో వైసీపీకి ఒక్క ఆత్మకూరు పట్టణంలోనే 3,914 ఓట్ల మెజార్టీ లభించింది. ఈ పరిస్థితుల్లో మున్సి పల్ ఎన్నికల్లో వైసీపీని దీటుగా ఎదుర్కొనే అభ్య ర్థుల కోసం మూడు నెలల ముందు నుంచే కూటమి నాయకులు అన్వేషిస్తున్నారు. ఆయా వార్డుల ఎన్నికల్లో పోటీ చేసే ఆశావాహులు ఎవరెవరు ఉన్నారు..? అందులో ఆర్థి కంగా బలంగా ఉండి గెలిచే గుర్రాలెవరన్న విష యాలపై ఆరా తీస్తున్నారు. అదేక్రమంలో చైర్మన్‌గా పోటీ చేసే అభ్యర్థి ఎంపికపై కూడా కూటమి నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఇందు కోసం ఇటీవల టీడీపీలోని ఓ కీలక నాయకుడి ఇంట్లో కొంతమంది ముఖ్య నాయకులు సమావే శమై మున్సిపల్ ఎన్నికల అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఏ వార్డులో ఎవరిని నిలబ డితే గెలుస్తామన్న అంశాలను పరిశీలిం చారు. అదేక్రమంలో జనసేన, బీజేపీకి ఏ వార్డులు కేటాయించాలన్న విషయాలను ప్రస్తావించినట్లు తెలిసింది. మొత్తంగా ఆత్మకూరులోని తోటగేరి, వెంగళరెడ్డిన గర్ ఏరియాల్లో కూటమి పటిష్టమైన బలం ఉండగా, మిగతా ఏరియాల్లో గట్టి పోటీ ఎదుర్కోవాల్సి ఉంటుందన్న అభి ప్రాయానికి ఆ నాయకులు వచ్చినట్లు సమాచారం.



ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయం

### కూటమి అస్త్రం వార్డుల విభజన!

ఆత్మకూరు పట్టణం 2011 డిసెంబరు 28వ తేదీన నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. ఆ సమయంలో పట్టణంలో 20వార్డులు మాత్రమే ఉండేవి. ఆ తర్వాత 2019 జూలై 24న ఆత్మకూరు నగర పంచాయతీ గ్రేడ్-3 మున్సిపాలి టీగా అప్‌గ్రేడ్ చెందింది. దీంతో 20వార్డులను 24వార్డులను పెంచాలని నిర్ణయించారు. ఆ సమ యంలో అప్పటి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అను చరులు తమకు అనుకూలంగా అడ్డగోలుగా వార్డుల పునర్విభజన చేపట్టినట్లు ఆరోపణలు న్నాయి. ఈ క్రమంలోనే జనాభా పెరుగుదల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 24 వార్డులను 28 వార్డు లుగా మార్చాలన్న అంశం తాజాగా తెరపైకి వచ్చింది. ఇందులో కూటమి నేతలకు మేలు జరి గేలా వార్డుల విభజన ఉందంటూ వైసీపీలో అల జడి మొదలైంది. అందుకే వార్డుల పునర్విభజనకు వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం చేస్తున్నారు.

## బీసీలకు భరోసా

- ఉన్నత విద్య చదివే విద్యార్థులకు ప్రయోజనాలు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- వాల్మీకి భవన్‌కు రూ.కోటి విరాళం
- మంత్రి టీజీ భరత్ హామీ
- ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు





వాల్మీకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు అధికారులు

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు భరోసానిచ్చేలా ప్రభుత్వ పాలన సాగుతోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఆర్.సవిత వెల్లడించారు. విద్యార్థుల కోసం రాష్ట్రంలో మరిన్ని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలి పారు. వెనుకబడిన తరగతుల విద్యకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధా న్యమిస్తోందన్నారు. మంగళవారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వాల్మీకి మహర్షి జయంతి రాష్ట్రస్థాయి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సవితతో పాటు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కలెక్టర్ డాక్టర్ సిరి, కర్నూలు, అనంతపురం ఎంపీలు బస్తిపాటి నాగరాజు, అంబిక లక్ష్మీనారాయణ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా చిత్రపటానికి మంత్రులు సవిత, టీజీ భరత్ వాల్మీకి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ వాల్మీకి రామాయణం సమాజానికి సన్మార్గాన్ని చూపుతుందన్నారు.

మిగతా 7లో...



హాజరైన వాల్మీకులు

# ప్రధాని పర్యటనపై సమీక్ష

- శ్రీశైలంలో ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు
- క్షేత్రస్థాయిలో భద్రతపై పరిశీలన
- పరిపాలనా భవనంలో ఏర్పాట్లపై సమీక్ష



అతిథి గృహంలో ఏర్పాట్లపై సమావేశమైన పోలీసు ఉన్నతాధికారులు



ఆలయం ముందు భాగంలో ఏర్పాట్లను తెలుసుకుంటున్న వీరపాండియన్

శ్రీశైలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన శ్రీశైలం పర్యటనకు రానున్న నేప థ్యంలో మంగళవారం ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేశారు. ప్రధాని పర్యట నను దృష్టిలో ఉంచుకుని సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు శ్రీశైలానికి చేరుకు న్నారు. ప్రధానమంత్రి ప్రోగ్రాం స్పెషల్ అధి కారి వీరపాండియన్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, ఈగల్ చీఫ్ ఆకె రవికృష్ణ, డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, గ్రేహౌం డ్స్ డీఐజీ బాబూజీ, ప్రకాశం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, సీఐడీ ఎస్పీ ఎస్పీ శ్రీధర్ రావు, నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్, ఐపీఎస్ అధికారి అధిరాజ్ సిగ్ రాణా, శ్రీశైలం ఆలయ ఈఓ శ్రీనివాస రావు తదితరులు పర్యటన ఏర్పాట్లను పర్య వేక్షించారు. ముందుగా వారు సున్నిపెంట హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలను పరిశీలిం చారు. అనంతరం శ్రీశైలానికి చేరుకుని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీ లించారు. అక్కడి నుంచి మల్లి కార్జునస్వామి ఆలయం ఎదు రుగా గంగాధర మం డపం వద్దకు చేరుకుని ప్రధాని పర్య టన ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. ఆలయ పరిసరాల్లో ఏర్పాట్లపై కూడా ఆరా తీశారు. ప్రధానమంత్రి సున్నిపెంట హెలీప్యాడ్ వద్ద ల్యాండ్ అయి అక్కడి నుంచి శ్రీశైలానికి రోడ్డుమార్గాన వస్తారు. దీంతో రహదారి వెంబడి భద్రతా ఏర్పాట్లు, రహదారిని పరిశీలించారు. రహదా రికి మరమ్మతులు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. తర్వాత శ్రీశైలం దేవస్థానం పరిపాలన భవనంలో ఉన్నతాధి కారులు సమావేశమయ్యారు. ప్రధా ని పర్య టనకు సంబంధించిన తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, చర్యలు, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చిం చారు. ఈ సమావేశంలో నంద్యాల ఏఎస్పీ యుగంధర్ బాబు, ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్, సీఐ ప్రసాదరావు, నంద్యాల జిల్లా సీఐలు పాల్గొన్నారు.



కేంద్రం వద్ద పోలీసుల పరిశీలన

## సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

- కర్ణాటకకు తరలిస్తున్న 35 టన్నుల బియ్యాన్ని పట్టుకున్న ఎన్ఫోర్స్‌మెంటు అధికారులు
- లారీని జలదుర్గం పోలీసులకు అప్పగింత

ప్యాపిలి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటుతున్నాయి. జిల్లా నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్ర మంగా తరలిస్తున్న లారీని మంగళవారం తెల్లవారు జామున ప్యాపిలి మండలంలోని చిగురుమాను మిట్ట వద్ద సివిల్ సప్లై, ఎన్ఫోర్స్‌మెంటు అధికారులు కాపుకాసి పట్టుకున్నారు. బియ్యం లారీని జలదుర్గం పోలీసులకు అప్పగించారు. బనగానపల్లి నుంచి కర్ణాటక రాష్ట్రానికి గత కొంత కాలంగా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు అధి కారులకు సమాచారం ఉంది. ఈ నేపథ్యంలో సోమ వారం రాత్రి 35 టన్నుల రేషన్ బియ్యాన్ని లారీలో కర్ణా టకకు తరలిస్తున్నట్లు సంబంధిత అధికారులకు ఓ అజ్ఞాత వ్యక్తి నుంచి సమాచారం అందింది. దీంతో జిల్లా సివిల్ సప్లై అధికారి రవిబాబు ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్ మెంటు డిప్యూటీ తహసీల్దార్లు తమ సిబ్బందితో చిగు రుమాను మిట్ట వద్ద కాపు కాశారు. బియ్యం తరలిస్తున్న లారీ రాగానే దాడి చేసి పట్టుకున్నారు. స్వాధీనం చేసు కున్న లారీని జలదుర్గం పోలీసులకు అప్పగించారు.



బియ్యం లారీని పట్టుకున్న సివిల్ సప్లై, ఎన్ఫోర్స్‌మెంటు అధికారులు

లారీలో 35 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు జలదుర్గం ఇన్‌చార్జ్ ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. సివిల్ సప్లై, ఎన్ఫోర్స్‌మెంటు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలి పారు. కాగా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమా ర్కులు ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకోవ డంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## రాఘవేంద్రా.. కష్టాలు కనవా..!

- గురురాఘవేంద్ర లిఫ్టులు ఉన్నా ఎత్తిపోయలేని పరిస్థితి
- నిర్వహణ, మరమ్మతులకు నిధులివ్వని ప్రభుత్వం



మంత్రాలయం మండలం మాధవరం స్టేజీ-1 పంప్‌హౌస్

కర్నూలు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మంత్రా లయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో వివిధ గ్రామాలకు తుంగభద్ర జలాలు ఎత్తిపోసి ఎల్లెల్సీ చివరి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఆయా నియో జకవర్గాల్లో 66,815 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం. పులికనుమ, పులకుర్తి ఎత్తిపోతల పథకాలు 15 ఏళ్లు కాంట్రాక్ట్ సంస్థ నిర్వహణలో ఉన్నాయి. మూగలదొడ్డి, బలసదొడ్డి, పులచింత, మాధవరం, చిలకలడోణ, సోగ నూరు, దుద్ది లిఫ్టులు జలవనరుల శాఖ, కృష్ణదొడ్డి, రేమట, మునగాల, కంబదహాల్, చింతమానుపల్లె ఎత్తిపోతల పథ కాలు ఏపీ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పర్యవేక్షణలో ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీటి నిర్వహణకు ఐదేళ్లు ఒక్కపైసా ఇవ్వలేదు. ఆపరేటర్లు, కాపల సిబ్బంది (వాచ్ అండ్ వార్డు) కూడా లేరు. దోపిడి దొంగలు పలు లిఫ్టుల పంప్ హౌస్‌లో పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్ వైరు, అయిల్ దోచుకెళ్లారు.

కూటమి ప్రభుత్వం రావడంతో గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల నిర్వహణ కష్టాలు తీరుతా యని రైతులు ఆశించారు. 15 నెలలు గడిచినా ఆ దిశగా చర్యలు శూన్యం. శాశ్వత మరమ్మతులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్ ఎం) కోసం రూ.17.05 కోట్లు ఇవ్వాలని పదేపదే జలవనరుల శాఖకు ప్రతిపాదనలు పంపించారు. మరమ్మతులు, ఓ అండ్ ఎం ప్రతిపాదనలు వేరువేరుగా పంపించాలని కొర్రీ పెట్టి వెనక్కి పంపించారు.

- మిగతా 6లో...

## వాగువెంట ఆశల అన్వేషణ!

**భారీగా తరలివచ్చిన ప్రజలు**



పిల్లలతో కలసి అన్నం తింటున్న మహిళలు





మహిళలతో వ్యాపారి

మహానంది, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అదృష్టం వరించక పోదా ఒక్క వజ్రమైనా దొరక్కపోదా.. అంటూ కొందరు వాగులవెంట వజ్రాల కోసం అన్వేషిస్తున్నారు. నంద్యాల-గిద్దలూరు జాతీయ రహదారి నల్లమల అటవీ ప్రాంతంలో సర్వ నరసింహస్వామి ఆలయం ఎదురుగా ప్రవహించే వాగు వద్ద గత రెండు రోజులుగా వజ్రాన్వేష కులు అధికమయ్యారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చి వజ్రాల కోసం వాగువెంట వెతుకులాట చేస్తున్నారు. వేల సంవత్సరాల క్రితం వెల సిన సర్వనరసింహస్వామి ఆలయానికి ఘన చరిత్ర ఉంది. ఇక్కడ రాజుల కాలంలో వజ్రాలను రాసులుగా పోసి కొలిచేవా రని పూర్వీకుల కథనం. అంతేకాక అప్పటి కాలంలో దోపిడి దొంగలు దొంగలిం చిన వజ్రాలను ఈప్రాంతంలో దాచు కొనేవారని కూడా ప్రచారంలో ఉంది. దీంతో నల్లమల అటవీ ప్రాంతంలో ఉండి వర్షాకా లంలో ప్రవహించే ఈవాగు గుండా వజ్రాలు బయట పడతాయని ప్రజల నమ్మకం. గతంలో కూడా చాలా మందికి వజ్రాలు లభించి లక్షాధికారులు కూడా అయ్యారు. దీంతో ప్రతి ఏటా ప్రకాశం, కడప, అనంతపురం, గుంటూరు, రాజమండ్రి, తది తర జిల్లాల నుంచి వందలాదిగా ఇక్కడకు చేరుకుని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటు న్నారు. రాత్రి సమయంలో ఆంజనేయపురం గ్రామం వద్ద నిద్రించి ఉదయం కాగానే అన్వే షణ మొదలు పెడతారు. ఉదయం అల్పాహా రంతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం వేళల్లో టీ,కాఫీల వరకు అక్కడే పూర్తి చేసుకొంటూ అన్వేషణ కొనసాగిస్తున్నారు. వాగువెంట తెల్లటి రాళ్ళను ఏరి వాటిని అక్కడికి వచ్చే వజ్రాల వ్యాపారులకు చూపిస్తూ కాలం గడిపేస్తున్నారు. ఈ వజ్రాల అన్వేషణలో వృద్ధులతో పాటు కొందరు మహిళలు చంటి పిల్లలతో రావడం విశేషం.

**వ్యాపారులకు పండుగ :** వజ్రాల వేట కోసం సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారితో స్థానికంగా వ్యాపారాలు ఊపందుకున్నాయి. పగలంతా వాగు వెంట వజ్రాల కోసం అన్వేషించి చీకటి పడగానే సమీపంలో ఉన్న అంజనేపురం గ్రామానికి వజ్రాన్వేషకులు చేరుకుం టారు. వీరు రాత్రివేళ విశ్రాంతి కోసం అక్కడ ఉండే ఇళ్ళను రూ.100 నుంచి 150 వరకు ఒక్కరోజుకు వసూలు చేస్తున్నారు. అలాగే కిరాణం, హోటళ్ల వ్యాపారాలు రెట్టింప య్యాయి.



వజ్రాల కోసం అన్వేషిస్తున్న మహిళలు

## ప్రధాని మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కర్నూలు ఎస్పీ

7

## డీజీపీ పర్యటన రద్దు

7

## మాంసం ఆరోగ్యంతో చెలగాటం

6



## వరద కడలిపాలు..
# రైతులు కన్నీటిపాలు..!

(5వ పేజీ తరువాయి)



గతేడాది గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం స్టేజ్-2 ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన ప్యానల్ బోర్డులు (ఫైల్)

మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్ హౌస్ దగ్గర 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేశారు. మాధవరం స్టేజ్-1 లిఫ్ట్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, బసలదొడ్డి స్టేజ్-1 పంప్ హౌస్‌లో ప్యానల్ బోర్డులు ధ్వంసం చేసి విలువైన కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కడపకు చెందిన ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ ఎండీ శివశంకర్‌రెడ్డి ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు పరిశీలించి వాటిని మరమ్మతులు చేయడం సాధ్యపడదని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని నివేదిక ఇచ్చారు. పలు ఎత్తిపోతల పథకాలు సింగిల్ ట్రాన్స్‌ఫార్మర్లతో తాత్కాలికంగా రన్ చేసే అవకాశం ఉన్నా, మాధవరం స్టేజ్-1, 2, బసలదొడ్డి స్టేజ్-2, చికలడోన స్టేజ్-1, స్టేజ్-2, పులచింత స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పూర్తిగా పడకేశాయి. వాటి శాశ్వత మరమ్మతులు ఎప్పుడు చేస్తారు..? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

● వివిధ ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు, నిర్వహణ ప్రతిపాదనలు (రూ.కోట్లల్లో):

| ఎత్తిపోతల పథకం | అంచనా (రూ.కోట్లలో) |
|---|---|
| మూగలదొడ్డి | 1.53 |
| బసలదొడ్డి | 2.66 |
| పులచింత | 3.93 |
| మాధవరం | 2.14 |
| చిలకలడోణ | 2.25 |
| సోగనూరు | 3.64 |
| దుద్ది | 0.89 |
| **మొత్తం** | **17.05** |

**● ప్రతిపాదనలు పంపుతున్నాం**

గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు, నిర్వహణ కోసం ప్రభుత్వానికి రూ.17 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. 2025-26 ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం మళ్లీ ప్రతిపాదనలు పంపాలని సూచనలతో ఫైలు వెనక్కి పంపించారు. పంపులు తాజాగా రేట్లకు కొటేషన్ తీసుకొని ప్రభుత్వం సూచనల మేరకు నూతన ఎస్ఎస్ఆర్ రేట్లకు ప్రతిపాదనలు తయారు చేసి త్వరలోనే ప్రభుత్వానికి పంపుతాం. నిధులు రాగానే మరమ్మతులు చేపడుతాం.

- బాలచంద్రారెడ్డి, ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ, కర్నూలు

## మట్టిలో మాణిక్యం వంశీకృష్ణారెడ్డి
### - తెలంగాణా గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటిన పెద్దకడబూరు వాసి



వంశీకృష్ణారెడ్డికి అభినందనలు తెలుపుతున్న తల్లిదండ్రులు

పెద్దకడబూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కుటుంబంలో పుట్టి రైతులకు, పేదలకు సేవలందిచాలనే ఉక్కు సంకల్పంతో కఠోర దీక్షతో చదివి లక్ష్యాన్ని చేదించి శభాష్ అనిపించుకున్నాడా విద్యార్థి. తెలంగాణా గ్రూప్-1 ఫలితాల్లో సత్తాచాటి మూడవ ర్యాంకు సాధించాడు. ఆ వివరాలు ఇవీ... మండల కేంద్రమైన పెద్దకడబూరుకు చెందిన స్వాతంత్ర సమరయోధుడు కే.శే వెంకటరెడ్డి ముని మనవడు వంశీకృష్ణారెడ్డి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీసు కమిషన్ గ్రూప్-1 పరీక్షల్లో మూడవ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డిని వారి కుటుంబ సభ్యులు, మండల ప్రజలు అభినందించారు. వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తమ తాత వెంకటరెడ్డిని ఆదర్శంగా తీసుకొని తాను ప్రజలకు, రైతులకు సేవ చేయాలన్న సంకల్పంతో గ్రూప్-1 ఉద్యోగాన్ని సాధించానన్నారు. ఐఏఎస్‌కు ఎంపికై దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నదే తన ఆకాంక్ష అన్నారు.

## మెరుగైన పాలనకు వార్డుల విభజన ఉండాలి

● మెజార్టీ కౌన్సిలర్లు సూచన
● కౌన్సిల్ సభలో వార్డుల పునర్విభజనపై రచ్చ
● మున్సిపల్ వార్డుల పెంపు తీర్మానం వాయిదా



వార్డుల పునర్విభజన కౌన్సిల్‌లో జరుగుతున్న చర్చ


ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా మెరుగైన పరిపాలన అందించే విధంగానే వార్డుల విభజన ఉండాలని మెజార్టీ కౌన్సిలర్లు సూచించారు. మంగళవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం పట్టణంలో ఉన్న 24వార్డులను 28వార్డులుగా పునర్విభజన చేసే అంశాన్ని ప్రస్తావించగా సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరిని సంప్రదించి వార్డుల విభజన చేశారని, అడ్డగోలుగా వార్డుల విభజన ఉందంటూ వైసీపీకి చెందిన కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఒకే కాలనీలో పక్కపక్కన, ఎదురెదురు నివాసం ఉంటే ఇళ్లను సైతం వేర్వేరు వార్డుల్లో ఉంచారని, కొన్ని చోట్ల ఒకే ఇంట్లో ఓటర్లను వేర్వేరు జాబితాలో మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటన్నింటిని పరిష్కరించకుండా వార్డుల పునర్విభజన ఏవిధంగా చేస్తారని సభ్యులు నిలదీశారు. రాజకీయాలకు అతీతంగా మెరుగైన పరిపాలన అందించే విధంగానే వార్డుల విభజన ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బా బు మాట్లాడుతూ.. 2011 డిసెంబరు 28న ఆత్మకూరు మేజర్ గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా రూపాంతరం చెందిందన్నారు. ఆ తర్వాత 2019 జూలై 24న గ్రేడ్-3 మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందిందని అన్నారు. జనాభా పెరుగుదల దృష్ట్యా ప్రస్తుతం ఉన్న 24వార్డులను 28వార్డులుగా మార్చాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. పేపర్ ప్రకటన ద్వారా ప్రజల నుంచి అభ్యంతరాలు కోరినప్పటికీ ఎలాంటి అభ్యంతరాలు రాలేదని తెలిపారు. రెండు కౌన్సిల్ సభల్లో ఈ తీర్మానం ఆమోదం పొందకపోతే ఆతర్వాత కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు. ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా మాట్లాడుతూ మరొకసారి వార్డు పునర్విభజన అంశాన్ని పరిశీలించాలని, అప్పటివరకు తీర్మానాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**ఇతరులను ఏవిధంగా అనుమతించారు?:** ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో వార్డు పునర్విభజన అంశంపై చర్చ జరుగుతుండగా టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా సభలోకి వచ్చి వెనుక ఉండే కుర్చీల్లో కూర్చుకున్నారు. దీంతో మున్సిపల్ ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా కౌన్సిల్ సభలోకి ఇతరులను ఏవిధంగా అనుమతిస్తారంటూ మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు టీడీపీ పట్టణాధ్యక్షుడు వేణుగోపాల్ స్పందిస్తూ.. కౌన్సిల్ సభలను వీక్షించేందుకు పబ్లిక్‌కు అవకాశం ఉంటుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీలో సైతం పబ్లిక్ గ్యాలరీ ఉంటుందన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

# మాంసం ఆరోగ్యంతో చెలగాటం

● రోడ్లపైనే విక్రయాలు
● జోరుగా కల్తీ మాంసం అమ్మకాలు
● నిబంధనలకు తూట్లు
● పట్టించుకోని అధికారులు





**బలవర్ధకమైన ఆహారం కోసం వైద్యులు పలు సార్లు మాంసాహారాన్ని తినమంటారు. కానీ ప్రస్తుతం మాంసం తింటే రోగాల బారిన పడే పరిస్థితులు కర్నూలు నగరంలోని నెలకొన్నాయి. మాంసం వ్యాపారులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఇష్టానుసారంగా మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. రోడ్ల మీద జంతువులను వధిస్తున్నారు. అక్కడే అమ్మకాలు జరుపుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.**



రోడ్ల పక్కన రక్షణ చర్యలు లేకుండా మాంసం విక్రయాలు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో మాంసం వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మాంసం విక్రయాలపై దృష్టిపెట్టాల్సిన మున్సిపల్ ప్రజారోగ్య అధికారులు వాటిమాటే మరిచిపోయారు. రోడ్లపైనే జం తువులు వధించి మాంసం విక్రయాలు జరుపుతున్నా అటువైపు కన్నెత్తి చూడటం లేదంటే అతిశయోక్తి కాదు. కల్తీ మాంసం తిని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా అధికారులు తమకు ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు.

**రెండు జంతు వధశాలలున్నా..**

నగరంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లపైనే జంతువులు వధించి మాంసం విక్రయాలు కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో అధికారికంగా రెండు జంతు వధశాలలున్నాయి. వాటిని టెండర్ల ద్వారా దక్కించుకున్న కాంట్రాక్టర్లు వ్యాపారులకు అద్దెలకిచ్చి డబ్బులు వసూలు చేసుకుంటున్నారు. పశువైద్యాధికారి, మున్సిపల్ ఆరోగ్య అధికారి పరిక్షించిన అనంతరమే ఈవధశాలలో పశువులను వధించాలని నిబంధనలున్నాయి. అవేమీ అమలు కావడంలేదు. నగరంలో వందల సంఖ్యలో అనుమతిలేని మాంసం దుకాణాలున్నాయి. షాపుల్లో జంతువులు వధించరాదని నిషేధాజ్ఞలున్నా ఎవరూ పాటించడం లేదు. కబేలా కంటే ఎక్కువ శాతం దుకాణాల వద్దే జంతువులు వధిస్తున్నారు.

**మాంసం కల్తీచేసి..**

నగరపాలక సంస్థ పరిధిలో ప్రజారోగ్యం పరిరక్షించేందుకు 19 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఒక శానిటరీ సూపర్‌వైజర్ ఉన్నారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు మామూళ్లకు అలవాటు పడిన కారణంగా కల్తీ మాంసం విక్రయాలు జోరు గా సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. పొట్టేలు మాంసం స్థానంలో కొందరు వ్యా పారులు నిషేధిత జంతువుల మాంసం కల్తీచేసి విక్రయిస్తున్నారు. దీనిని తిన్న ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారు.

**నిబంధనలు ఇలా:**

మాంసం విక్రయించే వ్యాపారి నగరపాలక సంస్థకు ఫీజు చెల్లించి తప్పని సరిగా అనుమతి పొందాలి. కబేలాతో పాటు బయట వధించే ప్రతి జంతువును పశువైద్యాధికారి పరిక్షించాలి. నగరపాలక సంస్థలో ఏళ్ల తరబడి పశువైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండగా రెండు నెలల క్రితం పశువైద్యాధికారిని నియమించారు.

● ఆరు నెలల కంటే తక్కువ వయస్సు ఉన్న జంతువులు వధించరాదు. అనుమతి పొందిన కబేలాలోనే వధించాలి. నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారులు దగ్గరుండి చెడిపోయిన కల్తీమాంసం తొలగించాలి.

**నిబంధనలు పాటించడం లేదు**



మాంసం వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. నిషేధిత జంతువులు సైతం రోడ్లపై వధించి వాటి మాంసం విక్రయిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

● ఎం.శ్రీహర్ష, ప్రగతి సమితి అధ్యక్షుడు, కర్నూలు



ఓర్వకల్లులో జ్యోతులతో చిందులు వేస్తున్న కళాకారులు



పూజలందుకుంటున్న చౌడేశ్వరి అమ్మవారు

## నేత్రపర్వం.. జ్యోతుల మహోత్సవం

● వేలాదిగా తరలి వచ్చిన భక్త జనం
● చౌడమ్మ ఉత్సవాల్లో అలరించిన నృత్య ప్రదర్శనలు

ఓర్వకల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తొగట వీర క్షత్రియ వంశస్థుల ఇలవేల్పు అయిన చౌడేశ్వరి మాత పున్నమి తిరుణాల ఓర్వకల్లులో సోమవారం రాత్రి నేత్రపర్వంగా సాగింది. ఉదయం అమ్మవారికి అర్చకులు శాస్త్రోక్తంగా విశిష్ట పూజలు నిర్వహించారు. సాయంత్రం పట్టు వస్త్రాలతో చౌడేశ్వరి దేవిని ముస్తాబు చేసి, సింహ వాహనంపై అధిష్టించి అశేష భక్త జనం మధ్య ఉరేగించారు. అనంతరం అమ్మవారికి భక్తులు సమర్పించిన 27 జ్యోతుల ఊరేగింపు ఉత్సవాలు సోమవారం రాత్రి 12.00 గంటలకు ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామున ముగిశాయి. భక్తులు జ్యోతులను తలపై పెట్టుకొని మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య గ్రామ పురవీధులలో భారీ ఊరేగింపు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి జ్యోతుల ఉత్సవాలను తిలకించారు. జ్యోతుల ఊరేగింపులో తొగట వీర క్షత్రియుల సంప్రదాయ నృత్య ప్రదర్శన, నందికోల సేవ, ఖడ్గ శావ, చెక్క భజన, కీలు గుర్రం, గొరవయ్యల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు అమ్మవారికి కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేడుకలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రధాని రాకతో శ్రీశైలానికి మరింత వైభవం
### - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న బీజేపీ నేత మాధవ్, కలెక్టర్ రాజకుమారి, ఎంపీ బైరెడ్డి శబరి, ఈఓ శ్రీనివాసరావు

శ్రీశైలం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటనతో శ్రీశైల వైభవం మరింత పెరుగుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మాధత్ పాటు శ్రీశైలం ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, కలెక్టర్ రాజకుమారి, ఈఓ ఎం.శ్రీనివాసరావులు పరిశీలించారు. శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ప్రధాని ఎక్కడెక్కడ పర్యటిస్తారు, ఎంత సమయం ఉంటారు వంటి అంశాలపై అధికారులతో కలసి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాధవ్ మాట్లాడుతూ ప్రధాని మల్లికార్జున స్వామి వారి దర్శనార్థం రావడం గొప్ప విశేషమన్నారు. తొలిసారిగా మోదీ ఇక్కడి జ్యోతిర్లింగం క్షేత్రానికి వస్తున్నారన్నారు. ఆయన రాకతో ఈ ప్రాంతం పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రధాని వచ్చిన తర్వాత ఇక్కడి ప్రాంతం విశిష్టత, విశేషాలను ఆయనకు తెలియజేస్తామన్నారు. దీంతో శ్రీశైలం ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి ద్వారా కృషి చేయిస్తామన్నారు. శ్రీశైలం నుంచి శివాజీ మహారాజ్ ధ్యానం చేసి దేశవ్యాప్తంగా జైత్రయాత్ర సాగించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ2.0 ద్వారా సరళీకృత విధానాన్ని తీసుకొచ్చి ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచిందన్నారు. దేశంలోనే తొలిసారిగా సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని కర్నూలులో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ఈనెల 16వ తేదీన జరిగే ప్రధాని సభను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏపీఆర్ సెట్ నోటిఫికేషన్ విడుదల

● మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
● నవంబరు 3 నుంచి 7 వరకు పరీక్షలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఏపీఆర్ సెట్ 2024-25) ద్వారా పీహెచ్‌డీ కోర్సులకు అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ అయింది. ఫుల్ టైం.. పార్ట్ టైమ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు హయ్యర్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి ఈ పరీక్షలు నిర్వహిస్తారు. నవంబరు 3 నుంచి 7వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇందుకోసం ఈనెల 7 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని రాయలసీమ యూనివర్సిటికి చెందిన రీసెర్చ్ విభాగం ప్రొఫెసర్లు తెలిపారు.

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయిన వందలాది వాహనాలు



# ఎంత కష్టం ఏమిటీ నిర్లక్ష్యం..?

● గంటల తరబడి స్థంభించిన ట్రాఫిక్ ● నాలుగేళ్లుగా సాగుతున్న రోడ్డు నిర్మాణాలు
● వాహనదారులు, ప్రజలకు తప్పని అవస్థలు

కర్నూలు అర్బన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా నాలుగేళ్లుగా వాహన దారులకు కష్టాలు తప్పడం లేదు. రోడ్డు నిర్మాణ పనులు ఏళ్లతరబడి పూర్తి కాకపోవడంతో వీరికి తిప్పలు తప్పడం లేదు. కర్నూలు- నందికొట్కూరు ప్రధాన రహదారిపై యల్లమ్మ గుడి వద్ద ప్రతి మంగళ, శుక్రవారాల్లో ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు, వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వారం ఇక్కడికి వేలాదిగా భక్తులు వస్తుంటారు. పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్డులో వాహనాలు ట్రాఫిక్ జామ్‌తో గంటల తరబడి చిక్కుకు పోవాల్సిన దుస్థితి నెలకొంది. పోలీసులు, దేవదయా శాఖ పట్టించుకోక పోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లుగా జాతీయ రహదారి పనుల పేరుతో రోడ్డు నిర్మాణాలు అటకెక్కాయి. గుడి ఎదురుగా ప్రధాన రహదారి సింగిల్ రోడ్డు కావడం.. పైగా రాష్ట్ర రాజధానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతి రోజు వేలాదిగా వాహనల రాకపోకలు జరుగుతున్నాయి. రోడ్డుపై గోతులు, కంకర రాళ్లతో పాటు భక్తుల రద్దీతో నిత్యం తొక్కిసలాటతో గుడి కిటకిటలాడుతుంటుంది. ఈ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాహనాలు ఎక్కడి కక్కడ నిలిచిపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు దాదారు 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌లో నరక యాతన అనుభవించారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



## బీసీలకు భరోసా

(5వ పేజీ తరువాయి)


జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి భరత్

రామాయణం కేవలం మత గ్రంథం కాదని, కుటుంబ విలువలు, నైతిక విలువలు బోధిస్తూ సమాజ నిర్మాణానికి దిక్సూచిగా పని చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో వాల్మీకులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీలో చేర్చేలా కృషి చేస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు.

**వాల్మీకి భవన్‌కు రూ.కోటి : టీజీ భరత్, మంత్రి**

వాల్మీకి భవన్ నిర్మాణానికి రూ. కోటి విరాళంగా ఇస్తాననీ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హామీనిచ్చారు. వాల్మీకులకు ఎస్టీ హోదాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్నందున ముఖ్యమంత్రి కృషి ఫలించి సానుకూల ఫలితాలు వస్తాయన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.10వేల కోట్లతో పెట్టుబడులు పెడుతూ పరిశ్రమలు వస్తున్నాయన్నారు. యువతకు స్థానికంగానే ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు.

- ఎంపి బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో వాల్మీకులు చదువులో చాలా వెనుకబడి ఉన్నారన్నారు. కర్నూలు జిల్లాలో వలసలు అధికంగా ఉన్నాయనీ, వారి విద్యాభివృద్ధి కోసం వసతి గృహాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.
- అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే వాల్మీకి మహర్షి రాష్ట్రస్థాయి జయంతి వేడుకలు కర్నూలులో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాల్మీకి అంటేనే ఒక నమ్మకం, విశ్వాసం, ధైర్యం చరిత్ర అన్నారు.
- ఎమ్మెల్సీ బీటీ నాయుడు మాట్లాడుతూ వాల్మీకుల కోరిక ఎస్టీ సాధనకు సీఎం చంద్రబాబు ఆశీర్వాదం వల్ల కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులుగా ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మంత్రులు కృషి చేస్తారన్నారు.
- కలెక్టర్ డాక్టర్ సిరి మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణం, భారతీయ సంస్కృతి, సాహిత్యం, ధర్మం, మానవత్వం విలువలతో కూడుకుని ఉంటుందన్నారు. రామయణాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ మంచి మార్గంలో ధర్మం వైపు నడవాలన్నారు.
- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి పరివర్తన చెంది రామాయణాన్ని రచించి ఆదికవిగా పేరుగాంచారన్నారు. కుటుంబ విలువల గురించి వాల్మీకి చెప్పిన మాటలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు.
- ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ ఎస్టీ హోదా కోసం కృషి చేస్తానన్నారు. గుంతకల్లు ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ వాల్మీకులు చదువుకుంటే భవిష్యత్తు బాగుంటుందని, పిల్లలను బాగా చదివించాలన్నారు. ఎటువంటి గొడవలు వెళ్లకుండా బాగా చదువుకుని జీవితంలో స్థిరపడాలన్నారు.

ఈ కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, కురువ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవేంద్రప్ప, బొందిల కార్పొరేషన్ చైర్మన్ విక్రమసింగ్, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్ రాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారి ప్రసూన, వాల్మీకి సంఘం నాయకులు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

## పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థి అరెస్టు

**కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ పోక్సో కేసులో ఇంటర్ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ పార్థసారధి తెలిపిన మేరకు.. ఓ మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసంచేసి గర్భవతిని చేశాడు. ఆలస్యంగా గుర్తించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్ష చేయించి గర్భవతి అని, శిశువు మృతి చెందినట్లు తెలిసింది. దీంతో బాలికను నిలదీయగా.. అసలు విషయం తెలిసింది. బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి జువైనల్ హోమ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## డీజీపీ పర్యటన రద్దు

- నేడు అడిషనల్ డీజీపీ రాక

**కర్నూలు క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** ప్రధాని పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించేందుకు డీజీపీ హరీష్ కుమార్ మంగళవారం రాత్రి కర్నూలు చేరుకోవాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల డీజీపీ పర్యటన రద్దయినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించేందుకు లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీపీ మాధవరెడ్డి నేడు కర్నూలుకు రానున్నట్లు సమాచారం. రాగమయూరి వద్ద ఉన్న సభా స్థలాన్ని, ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని అడిషినల్ డీజీపీ పరిశీలించనున్నారు.

## యూట్యూబర్లపై సబ్‌రిజిస్ట్రార్ ఫిర్యాదు

**అవుకు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** నిత్యం విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులు కలిగిస్తున్న యూట్యూబర్లపై అవుకు సబ్ రిజిస్ట్రార్ నీలమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. సెల్‌ఫోన్లతో వీడియోలు తీస్తూ, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్న ఐదుగురు యూట్యూబర్లపై ఆమె ఎస్ఐ రాజారెడ్డికి మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొంతమంది యూట్యూబర్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి విధుల్లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ పట్ల దురుసుగా ప్రవర్తించినట్లు ఎస్ఐ తెలిపారు.

## బస్సు బోల్తా - తప్పిన ప్రమాదం

**ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):**


బోల్తా పడిన ప్రైవేటు బస్సు

మండలంలోని ఎర్రకోట సమీపంలో ఓ ప్రైవేటు బస్సు మంగళవారం తెల్లవారు జామున బోల్తాపడింది. ఈ ఘటనలో అదృష్టవశాత్తూ ప్రమాదం తప్పింది. స్థానికులు, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదోనికి చెందిన శ్రీనివాస ట్రావెల్స్ బస్సు హైదరాబాదు నుంచి ఆదోనికి బయలుదేరింది. ఎర్రకోట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న దున్నపోతును తప్పించబోయి బోల్తాపడింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఎమ్మిగనూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నందవరం మండలం జగ్గాపురానికి చెందిన ఇంటర్ విద్యార్థి వెంకటేష్, ఆదోని గోబి సెంటర్‌లో పనిచేస్తున్న మదన్‌సింగ్‌లు స్నేహితులు. ఎమ్మిగనూరు పట్టణం నుంచి బోలేరో వాహనం ఆదోని వైపు వెళ్తు ఫైర్‌స్టేషన్ సమీపంలో ఉన్న సర్వీసింగ్ సెంటర్‌లోకి వెళ్లేందుకు తిరుగుతుండగా అదే సమయంలో ఆదోని వైపు నుంచి వస్తున్న వెంకటేష్, మదన్‌సింగ్‌ల మోటారు సైకిల్ ఢీకొనడంతో ఇద్దరు ఎగిరి రోడ్డుపక్కన పడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వటంతో హుటాహుటిన ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడటంతో వీరిని మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రధాని మోదీ పర్యటనకు భారీ ఏర్పాట్లు

- 185 ఎకరాల్లో సభా ప్రాంగణం
- స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ పర్యవేక్షణ
- జిల్లా అధికారులకు బాధ్యతలు


సభా స్థలం వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

### భద్రతపై ప్రత్యేక దృష్టి

ప్రధాని మోదీ కర్నూలు పర్యటన ప్రారంభం మొదలు తిరిగి వెళ్లేంత వరకు ఎలాంటి భద్రతా సమస్యలు తలెత్తకుండా పక్కా వ్యూహంలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్కింగ్, రూట్స్ డైవర్షన్, హెలిపాడ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించారు. సభా ఏర్పాట్లు, కర్నూలు, నంద్యాల జిల్లా నుంచి వచ్చే ప్రజలు సభా ప్రాంగణానికి ఎలా చేరుకోవలో రూట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఏఎస్పీ హుసేన్‌పీరా, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎస్పీలు, సీఐలతో కలసి ఏర్పాట్లను పరిశీలించారు. అదే క్రమంలో భారీ ఎత్తున జనసమీకరణ చేసి ప్రధాని మోదీ సభను దిగ్విజయం చేయాలని కూటమి పార్టీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

**కర్నూలు/ కర్నూలు క్రైం/ ఓర్వకల్లు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఎన్డీఏ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్‌కు మూడోసారి రానున్నారు. కర్నూలు నుంచే ఈ నెల 16 జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ శంఖారావం పూరిస్తుండడంతో అందరి దృష్టి కర్నూలుపై పడింది. కూటమి ప్రభుత్వం ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. భారీ సక్సెస్ చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసింది. సీఎం చంద్రబాబు ఆదేశాలతో రాష్ట్ర మంత్రులు పయ్యావుల కేశవ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డిలు ఇప్పటికే కర్నూలులో పర్యటించారు. నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలో 185 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాగమయూరి వెంచర్‌ను ప్రధాని మోదీ సభకు ఎంపిక చేశారు. మంగళవారం కర్నూలుకు చేరుకున్న పీఎం ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కలెక్టర్ డాక్టర్ సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణానికి రూట్‌మ్యాప్ తదితర అంశాలపై అధికారులు కరసత్తు చేస్తున్నారు. రాష్ట్ర సచివాలయం నుంచి వివిధ శాఖ ముఖ్య కార్యదర్శులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రధాని సభకు మిగిలిన సమయం తొమ్మిది రోజులే. 14వ తేది సాయంత్రంలోగా ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేయాల్సి ఉంది. ఆ తరువాత కేంద్ర నిఘా, భద్రతా అధికారుల నిర్వహణలోకి సభా ప్రాంగణం వెళ్లే అవకాశం ఉంది. అంటే.. మిగిలిన సమయం కేవలం ఆరు రోజులే.

**జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు**

సభా ఏర్పాట్లపై రూట్ మ్యాప్ తయారు చేశారు. వేదిక నిర్మాణం, పార్కింగ్, జన సమీకరణ, బస్సులు సమకూర్చడం, భోజనాలు, నీరు, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ఏఏ రూట్లలో ఏ ప్రాంతానికి చెందిన వాహనాలు అనుమతించాలి.. వివిధ విభాగాలుగా పనులు విభజించారు.


బందోబస్తు ఏర్పాట్లలో ఎస్పీ విక్రాంత పాటిల్

డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్, జడ్పీ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు శాఖ, విద్యుత్, సోషల్ వెల్ఫేర్... ఇలా వివిధ విభాగాల పీడీలు, సీఈవోలు, ఎస్ఈలకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో వివిధ మండలాల్లో పని చేసే యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. వారితో స్పెషల్ అధికారి వీర పాండియన్, జిల్లా కలెక్టరు ఎ.సిరిలు వారితో సమీక్షలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీఆర్‌డీఏ రమణారెడ్డి, హౌసింగ్ పీడీ చిరంజీవి తదితరులు మండల స్థాయి అధికారులతో సమావేశమైన సభా ఏర్పాట్లను విభజించి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాల నుంచి భారీ ఎక్స్‌కవేటర్లను తెప్పించి సభా ప్రాంగణం చదును చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ కోసం 11 ప్రదేశాలు గుర్తించారు. వివిధ శాఖ అధికారుల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా వీవీఐపీలు, వీఐపీలకు, సభా వేదిక ఏర్పాట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు అప్పగించారు. సేఫ్ రూమ్స్, స్పెషలిస్ట్ వైద్యులు, మెడికల్ టీమ్స్, అంబులెన్స్.. వంటి ఏర్పాట్లను ప్రభుత్వ జర్వజన వైద్యశాల సూపరింటెండెంట్, డీఎంహెచ్‌ఓలకు అప్పగించారు. వివిధ ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు.


సభా ప్రాంగణం వద్ద పనులు చేస్తున్న దృశ్యం

## ఇద్దరు బాలికలు అదృశ్యం!

- గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన పోలీసులు


బాలికలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

**ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు అదృశ్యమైన కేసును పోలీసులు గంటల వ్యవధిలోనే ఛేదించారు. ఎస్పీ సునీల్ షెరాన్ ఆత్మకూరు అర్బన్ సీఐ రామును అభినందించారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రహమత్‌నగర్‌కు చెందిన ఓ బాలిక పాములపాడులో ఇంటర్మీడియట్ చదువుతోంది. ఫోన్ మాట్లాడొద్దని తల్లి మందలించడంతో మనస్థాపానికి గురై ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన కుమార్తెతో పాటు మేనకోడలు కనిపించడం లేదని ఆమె పోలీసులకు ఫోన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ బాలికలు ఇద్దరికి బంధుత్వంతో పాటు మంచి స్నేహం కూడా ఉంది. బాలికల మిస్సింగ్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు వారి ఆచూకీ కోసం పట్టణంలోని సీసీ కెమెరాలు, అనుమానిత వ్యక్తి లోకేషన్ గుర్తింపుపై ఆరా తీశారు. నందికొట్కూరు పోలీసులతో పాటు కర్నూలు, డోన్ రైల్వేస్టేషన్ల పోలీసులను కూడా అప్రమత్తం చేశారు. అయితే వారి వద్ద సెల్‌ఫోన్ లేకపోవడంతో వారి ఆచూకీని గుర్తించడం పోలీసులకు కష్టమైంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి బాలిక తల్లికి ఒకరు ఫోన్ చేసి మీ ఇంటికి కొరియర్ వచ్చిందా..అని వెంటనే ఫోన్ పెట్టేశారు. విషయాన్ని పోలీసులకు తెలియ జేయడంతో వెంటనే సీఐ రాము ఆ ఫోన్ నంబరు గల వ్యక్తికి ఫోన్ చేయగా హైదరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఇద్దరు మైనర్ బాలికలు తన వద్ద నుంచి ఫోన్ తీసుకుని మాట్లాడారన్న విషయాన్ని తెలిపారు. వెంటనే హైదరాబాద్‌లో నివాసం ఉండే ఆత్మకూరుకు చెందిన వ్యక్తులను అక్కడికి పంపించి ఆ బాలికల ఫొటోలను వాట్సాప్‌లో పెట్టారు. అక్కడికి వెళ్లిన వారు బస్టాండ్‌లో గాలించగా రాత్రి 11 గంటలకు ఆ ఇద్దరు బాలికలు అక్కడే ఉన్నట్లు గుర్తించారు. విషయాన్ని సీఐ రాముకు తెలియజేయడంతో ఆయన హైదరాబాద్ బస్టాండ్‌లోని పోలీసు ఔట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. అఫ్జల్‌గంజ్ పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వెంటనే ఆత్మకూరు పోలీసులు, బాలికల కుటుంబీకులు హైదరాబాద్‌కు వెళ్లి వారిని ఆత్మకూరుకు తీసుకొచ్చారు. కాగా పారిపోయేందుకు ప్రయత్నించిన ఆ ఇద్దరు బాలికలు బస్టాండ్ నుంచి వెళ్తే పోలీసులు గుర్తిస్తారన్న అనుమానంతో ఆటోలో కరివేన వరకు వెళ్లి అక్కడి నుంచి కర్నూలుకు, కర్నూలు నుంచి హైదరాబాద్‌కు బస్సులో వెళ్లినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తల్లి మందలించినందుకే వారు ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

**మంత్రాలయం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):**

మండలంలోని చెట్నహల్లి సమీపంలో ఆగి వున్న బొలేరోను ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మంగళ వారం జరిగింది. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాల మేరకు బొలేరో గొర్రెలను ఎక్కించుకుని మాధవరం నుంచి ఎమ్మిగనూరు వెళ్తుండగా.. టెంపోను రోడ్డు పక్కన పార్కింగ్ చేశారు. రాంపురం చెందిన ఆటో డ్రైవర్ నాగలదిన్నె అయ్యప్ప అనే వ్యక్తి బెంగళూరు రామనాథహల్లికి చెందిన వేణుగోపాల్, రాధ, షాలిని, సహదేవలను ఎక్కించుకుని మంత్రాలయం వస్తూ ఆగి ఉన్న బొలేరోను ఢీకొట్టాడు. దీంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమ్మితం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. భక్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## క్యాన్సర్ హాస్పిటల్‌కు సక్సన్ ఆపరేటర్లు

**కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం రూ.50వేల విలువ చేసే రెండు సక్సన్ ఆపరేటర్లను విరాళంగా అందించారు. మంగళవారం క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మకు కేఎంసీ అల్యూమి అధ్యక్షుడు డా.కుమార స్వామిరెడ్డి, సెక్రటరీ డా.జి.బాలమద్దయ్య, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డా.కేజీ గోవిందరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.సాయిప్రదీప్, సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, అల్యూమి నాయకులు డా.రామచంద్రరావు, డా.వై.ప్రవీణ్ కుమార్, క్యాన్సర్ వైద్యులు పాల్గొన్నారు.

## పట్టపగలే చోరీ..

- 10 తులాల బంగారం, 10తులాల వెండి, రూ.10వేల అపహరణ

**కొలిమిగుండ్ల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండలంలోని మదనంతపురం గ్రామంలో పట్ట పగలే భారీ చోరీ జరిగిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన అంబటి జనార్ధనరెడ్డి గ్రామ చివరన కలాల కాలనీలో కొత్త ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. అయితే మంగళవారం ఉదయం 8గంటల సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంటికి తాళం వేసి పొలం పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి చేరుకోగా, ఇంటి తాళం పగులగొట్టి, డోర్లు తెరిచి ఉండటంతో ఆందోళనతో ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు అర్థమైందని జనార్ధనరెడ్డి తెలిపారు. బీరువా తాళాలు అక్కడే పెట్టి ఉండటంతో, దొంగలు బీరువాను తెరిచి, అందులోని 10 తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. 3తులాలు నల్ల పూసల దండ, 6జతల కమ్మలు, 6ఉంగరాలు, ఒకటి సాదా చైన్‌తో పాటు, 10తులాల వెండి, రూ.10వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.12లక్షలు పైబడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మదనంతపురంలో ధ్వంసమైన బీరువా

**కోసిగిలో 6 తులాల బంగారు, కేజీ వెండి, రూ.లక్ష నగదు మాయం**

**కోసిగి:** ఉరుకుంద రోడ్డు సాయిబాబా నగర్‌లో మంగళవారం చోరీ జరిగింది. సాయిబాబా నగర్‌లో నివాసముంటున్న లీలావతి, మధు సోమవారం ఇంటికి తాళం వేసి కౌతాళానికి వెళ్లారు. దీంతో అదే రోజు అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోని బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారం, కేజీ వెండి, లక్ష నగదును దోచుకెళ్లినట్లు బాధితులు కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. అలాగే ఇంటికి ఉన్న సీసీ పుటేజీలో దొంగతనం చేస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. కాగా కోసిగిలో గత కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు మండల ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. గత శనివారం వందగల్లు గ్రామంలో ఆర్ఎంపీ డాక్టర్ పీర్ మహ్మద్ ఇంట్లో దొంగలు చొరబడి 4 తులాల బంగారం, రూ.5వేల నగదు దోచుకెళ్లారు. రెండురోజుల వ్యవధిలోనే సాయిబాబా నగర్‌లో భారీ దొంగతనం జరగడం చర్చనీయాంశమైంది. రాత్రివేళలో పోలీసులు గస్తీ లేకపోవడంతోనే దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఎస్ఐ హనుమంతరెడ్డిని వివరణ కోరగా.. కేసు నమోదు చేసి దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేస్తామన్నారు.

## వన్య ప్రాణులను కాపాడుకోవాలి

**బండిఆత్మకూరు అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):** జాతీయ సంపదైన వన్యప్రాణులను కాపాడుకోవాలని ఎఫ్ఎస్‌వోలు కాశీంనాయక్, హైమావతి సూచించారు. మంగళవారం బండిఆత్మకూరు మోడల్ స్కూల్‌లో వన్యప్రాణుల రక్షణపై ప్రిన్సిపాల్ అబ్దుల్ రఫిక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాగరాజు, ఎఫ్‌బీవో ప్రసన్నలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

**గాజులపల్లిలో ...**

**మహానంది:** అడవుల సంరక్షణపై అవగాహన పెంచుకోవాలని చలమ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ జి.విజయవర్ధన్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం గాజులపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు, అటవీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'అడవుల సంరక్షణ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు అటవీ అధికారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గాజులపల్లి బీట్ ఆఫీసర్ కె.మద్దిలేటిస్వామి, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

**వెలుగోడు :** నేటి సమాజంలో వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని టౌన్ ఫారెస్టు అధికారి గోపినాథ్ అన్నారు. మంగళవారం గుండు మల్లెమ్మ బేసుక్యాంపు వద్ద అటవీశాఖ అధికారులు, సిబ్బంది, వన సంరక్షన సమితి సభ్యులు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**పగిడ్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధక్ష్యుడు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కార్మికులతో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రాజు, అబ్దుల్ రహీమన్, హమీద్, పఠాన్, ఇబ్రహీం తదితరులున్నారు.

## యాప్‌లను బహిష్కరిస్తాం : ఏపీటీఎఫ్

**నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** ఈ నెల 10నుంచి ఉపాధ్యాయులకు సంబంధించిన బోధనేతర యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మాధవస్వామి, ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. విజయవాడలో జరిగిన ఫ్యాప్టో రాష్ట్ర స్థాయి పోరుబాట కార్యక్రమం విజయవంతం కావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పుల్లయ్య, స్వామినాథం, శ్రీరాములు, వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, శివప్రసాద్, అలీఖాన్, రాఘవరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సోమశేఖరరెడ్డి, అబ్దుల్‌వహీద్ తదితరులు పాల్గొన్నారు.

## 10న ఎస్‌జీఎఫ్ మండల స్థాయి పోటీలు

**నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల మండలానికి సంబంధించి ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఈ నెల 10న పట్టణంలోని కేఎన్‌ఎం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ చంద్రావతమ్మ తెలిపారు. మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్‌బాడ్మింటన్, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరూ పాల్గొనవచ్చన్నారు. విద్యార్థులు మిడ్‌డే మీల్స్ దరఖాస్తు, భోజన ప్లేట్లు తీసుకురావాలని సూచించారు. సీబీఎస్‌ఈ విద్యార్థులు డిక్లరేషన్ ఫాం, ఎలిజబులిటి ఫాం, ఆధార్‌కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు.

## ఘనంగా ప్రపంచ పత్తి దినోత్సవం

**నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో మంగళవారం ప్రపంచ పత్తి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఏఆర్‌ఎస్ అధిపతి డాక్టర్ ఎం.జాన్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో పత్తిపంటను సాగుచేసే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటిని అధిగమించేందుకు పాటించాల్సిన విధానాలను వివరించారు. అనంతరం పత్తి సాగు చేసే ఉత్తమ రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు, పత్తిరైతులు పాల్గొన్నారు.

## పండ్ల తోటలతో ఆర్థిక పురోగతి

**గడివేముల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** పండ్ల తోటల పెంపకంతో ఆర్థిక పురోగతి సాధించాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కార్తీక్ అన్నారు. మంగళవారం ఎల్‌కే తండా గ్రామంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్, అపార్డ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 500 ఎకరాల్లో పండ్ల తోటలను సాగు చేస్తున్నారని అన్నారు. రైతులకు ఎరువులు, పురుగు మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపార్డ్ సంస్థ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

## రేపు నంద్యాలలో ఉద్యోగ మేళా

**నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :** పట్టణంలోని జ్ఞానాపురంలోని నేషనల్ ఐటీఐ కాలేజీలో ఈనెల 9న ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెట్రోల్యాబ్స్, ఫోన్‌పే కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, చదివినా అభ్యర్థులు మేళాకు హాజరవ్వాలని సూచించారు. వివరాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎన్‌సీఎస్.జీవోవీ. ఇన్ నందు రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

## నందీశ్వర స్వామికి విశేషపూజలు

**శ్రీశైలం, అక్టోబరు 7,(ఆంధ్రజ్యోతి):** లోక కల్యాణం కోసం దేవస్థానం మంగళవారం ఆలయ ప్రాంగణంలోని నందీశ్వరస్వామికి(శనగల బసవన్న స్వామికి) విశేషార్చనలను నిర్వహించారు. నందీశ్వరస్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలతో, శుద్ధజలంతో అభిషేకించారు. అలాగే సుబ్రహ్మణ్యస్వామి(కుమారస్వామి) వారికి విశేష పూజలను నిర్వహించారు.

## జీఎస్టీపై అవగాహన ర్యాలీ

**నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల విద్యార్థులు జీఎస్టీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఒకేదేశం ఒకే పన్ను అనే నినాదం చేస్తూ ప్లకార్డులతో కళాశాల నుంచి ఎస్‌బీఐ కాలనీ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. సూపర్ జీఎస్టీ లక్ష్యాలు, ప్రయోజనా లపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి బి.శంకర్‌నాయక్, విద్యార్థినులు పాల్గొన్నారు.



# మహనీయుల జీవితచరిత్ర తెలుసుకోవాలి

- ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి
- పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి నివాళి
- జిల్లా వ్యాప్తంగా మహర్షి జయంతి

**నంద్యాల టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** యువత మహనీయుల జీవిత చరిత్ర తెలుసుకోవాలని ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి ఎస్పీ డీఎస్పీ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత విలువలు, ఆదర్శ భావాలు బోధించే రామయణం లాంటి మహా కావ్యాన్ని చదవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

**రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో..**

**నంద్యాల కల్చరల్:** వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఆర్టీసీ బస్టాండు సమీపంలో గల వాల్మీకి విగ్రహానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో మాలార్పణ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంఘ సంచాలకులు శ్రీనివాస్, నగర సంచాలకులు మహేశ్వరరెడ్డి, నగరప్రచార ప్రముఖ్ వాసు, స్వయంసేవకులు పాల్గొన్నారు.


వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పోలీసు సిబ్బంది

**ఆత్మకూరు పట్టణంలో..**

**ఆత్మకూరు:** వాల్మీకి మహర్షి జీవితం మానవాళికి ఆదర్శనీయమని ఆదిత్యా, దీపా కళాశాలల ప్రిన్సిపాళ్లు విజయభాస్కర్ నాయుడు, వెంకటరమణ అన్నారు. మంగళవారం వాల్మీకి జయంతి సందర్భంగా అర్బన్ కాలనీలోని వాల్మీకి విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం సమాజానికి ఎంతో ఆదర్శమన్నారు. మహర్షి రచించిన రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమేనని వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు జనార్దన్‌రావు , వాల్మీక సంక్షేమ సంఘం నాయకులు నాగరాజు, రవి, శివ, మల్లికార్జున ఉన్నారు.


నెహ్రూనగర్‌లో వాల్మీకికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

**బండిఆత్మకూరు :** వాల్మీకి జయంతిని పెద్దదేవళాపురం గ్రామంలోని ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి ఆలయంలో వాల్మీకి చిత్రపటానికి ఆ సంఘం నాయకులు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఎం వెంకటేశ్వర్లు , జయన్న, జీ వెంకటేశ్వర్లు, సంజీవ, వినయ్, చంద్రమోహన్ పాల్గొన్నారు.

**మిడుతూరు:** మండలంలోని మిడుతూరు, చింతలపల్లి, పీరుసాహెబ్‌పేట తదితర గ్రామాల్లో మహర్షివాల్మీకి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి, చిత్రపటానికి వాల్మీకులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకి చిత్రపటాన్ని వీధుల్లో ఊరేగించారు.

**నెహ్రూనగర్‌లో..**

**పగిడ్యాల:** మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి చిత్రపటాన్ని వీధుల్లో ఊరేంగించారు.

**గడివేముల:** మండల కేంద్రంలోని వాల్మీకి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి విగ్రహానికి అభిషేకాలు చేశారు. గడిగరేవుల, గడివేముల గ్రామాల్లో వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో వాల్మీకి పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.


రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సేవకులు


ఆత్మకూరులో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


గడివేములలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

## పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

**పగిడ్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** అనారోగ్యంతో బాధపడే పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలాంటిదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి బాధితులు మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన కురువ వెంకటనారాయణకు, గుజ్జుల మద్దమ్మ , లక్ష్మీనాగయ్య, ప్రాతకోట గ్రామానికి చెందిన ఉసేనాలం , తిరుపాలుకు , తిప్పే కిరణ్, శాలుమియ్యకు మంజూరైన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు డైరెక్టరు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మండల కన్వీనరు పలుచాని మహేశ్వరరెడ్డి, పగిడ్యాల సహకార సొసైటీ డెరెక్టర్లు గంగన్న, శంకర్, ఆయా గ్రామాల నాయకులు లోకానందరెడ్డి, చాకలి రామస్వామి, ఫరూక్ బాషా, వెంకట్‌రెడ్డి, నాగశేషులు, బాలీశ్వరు గౌడ్, శ్రీనివాసనాయుడు, వెంకటేశ్వర్లు, ఉసేన్ సాహెబ్ , రాజశేఖర్‌రెడ్డి, భూపిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**జీఎస్టీ తగ్గింపుపై అవగాహన**

జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఒక్క కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం ప్రాతకోట గ్రామంలో జీఎస్టీ తగ్గింపునకు సంబంధించిన పత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులున్నారు.


బాధితులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

## పని గంటల పెంపు సరికాదు : సీఐటీయూ

**నంద్యాల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :** పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో 8 గంటల పనిని 13 గంటలకు పెంచుతూ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లును ఆమోదించటాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. పని గంటల పెంపు విధానాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని గాంధీచౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీజేపీ ప్రభుత్వం కార్మికుల చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లను ఆమోదించిందన్నారు. ఈ కోడ్ అమలులో భాగంగానే ఏపీ రాష్ట్ర ప్రభుత్వం పనిగంటలు పెంచి కార్మికుల శ్రమను యాజమాన్యాలు దోచుకునేలా అవకాశం కల్పించిందన్నారు. ఎక్కువ సెలవులు పొందేలా ఈ సవరణలు చేస్తున్నామని చెప్పటం కార్మికులను మోసగించటానికేనన్నారు. కనీసం కార్మిక సంఘాలతో చర్చించకుండా అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టటాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోకపోతే రాబోయే రోజుల్లో నిరసనలు పెద్ద ఎత్తున చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మద్దులు, మహ్మద్ గౌస్, సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు లక్ష్మణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహనాయక్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, పట్టణ కార్యదర్శి మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీకి తేడా తెలియదు

- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నందికొట్కూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్, ప్రైవేటీకరణకు మధ్య తేడా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తెలియకపోవడం శోచనీయమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. మంగళవారం నందికొట్కూరులోని ఆమె నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1995 నుంచి 2004 లోపు 19 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత టీడీపీదేనన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో నాడు 50శాతం సీట్లు ప్రైవైటైజేషన్ చేసింది మీరు కాదా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. రెండు సంవత్సరాల్లో రూ.7 వేల కోట్లు ఖర్చు చేయాలంటే కేంద్రానికి కష్టమౌతోందని, రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. పీపీపీ విధానం వల్ల ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో అత్యాధునికమైన వైద్య సదుపాయాలు పేద ప్రజలకు అందుతున్నాయన్నారు. మెడికల్ విద్యార్థులపైన అంత ప్రేమ ఉంటే పులివెందులలోని మెడికల్ హాస్పిటల్‌ను ఎందుకు పూర్తి చేయలేదని ఆమె ప్రశ్నించారు. ఈనెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాకతో రాష్ట్రం, నంద్యాల జిల్లా, శ్రీశైల దేవస్థానం ఎంతగానో అభివృద్ధి చెందుతాయన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కాకరవాడ చిన్నవెంకటస్వామి, పల్లె రఘురామిరెడ్డి, చాంద్‌బాషా, గుణశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

**స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ**

**పగిడ్యా:** మండల పరిధిలోని కొత్త, పాత ముచ్చుమర్రి, వనములపాడు గ్రామాల్లో రేషన్‌కార్డు దారులకు ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దారు మురళీ, పంచాయతీ కార్యదర్శి వీరన్న తదితరులున్నారు.

## మంత్రిని కలిసిన శ్రీశైలం దేవస్థాన బోర్డు సభ్యురాలు


మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సింధుశ్రీ

**నంద్యాల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :** శ్రీశైలం బోర్డు సభ్యురాలు డాక్టర్ సింధుశ్రీ తన కుటుంబ సభ్యులతో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింధుశ్రీ మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గం నుంచి తమకు ఈ అవకాశం కల్పించినందుకు కూటమి ప్రభుత్వానికి, మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ బోర్డు సభ్యులు దేవస్థాన అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. కార్యక్రమంలో జగన్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ జగన్ మోహన్‌రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దేశద్రోహం కేసు నమోదు చేయాలి

**నంద్యాల రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) :** భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయిపై సనాతన పేరుతో బూటు విసిరిన మతోన్మాది న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సంజీవనగర్ గేటు సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు పి.మురళీధర్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు సోమన్న, నాగరాముడు, శ్రీనివాసులు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## అబద్ధాలు చెప్పడం సరికాదు

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి

**కొత్తపల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** తమ అధినేత సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేస్తుంటే.. వైసీపీ నాయకులు వీటిపై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కాకరవాడ చిన్న వెంకటస్వామి అన్నారు. మంగళవారం ఆయన ముసలిమడుగులో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు దశలవారిగా నెరవేరుస్తుంటే.. వైసీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. అనంతరం పెద్దగుమ్మడాపురంలో టీడీపీ సీనియర్ నాయకుడు నాగ శేషన్న యాదవ్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, జడ్.వెంకటరెడ్డి, చిన్న పుల్లారెడ్డి తదితరులున్నారు.

## షిర్డిసాయిబాబా మందిర వార్షికోత్సవం


సాయిబాబాకు హారతి ఇస్తున్న అర్చకులు

**నంద్యాల కల్చరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని బొమ్మలసత్రంలో వెలసిన షిర్డీ సాయిబాబా మందిర మొదటి వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం స్వామివారి మేలుకొలుపు, పంచామృత అభిషేకాలు, హోమాలు, మధ్యాహ్నహారతి నిర్వహించారు. హోమాలు అనంతరం పూర్ణాహుతి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, శివనాగేందర్‌రెడ్డి సాయి సేవకులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

## లోక కల్యాణార్థం పౌర్ణమి హోమాలు

**నంద్యాల కల్చరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని అమ్మస్ఫటి కలింగేశ్వరాలయంలోని అమరయోగా వికాస కేంద్రంలో మంగళవారం ఆశ్వీయుజమాస పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించారు. నిర్వాహకులు యోగానంద ఆధ్వర్యంలో స్పటికలింగేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అచల పరిపూర్ణానంద పాములేటి స్వామి విగ్రహానికి పంచామృతాభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం లోక కల్యాణార్థం గాయత్రీ హోమం, పూర్ణాహుతి అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

**ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** పట్టణంలో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న ఏపీ రైతు సంఘం జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ప్రచార యాత్రను ప్రారంభించారు. రైతు సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న జిల్లా మహాసభలకు రైతులు, రైతు సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. నాయకులు ఉన్నారు.

## ఆశావర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలి


వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

**ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్, ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ నాయకురాలు శాంతి, భారతి అన్నారు. మంగళవారం పట్టణంలోని అర్బన్ హెల్ సెంటర్‌లో వైద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు రణధీర్, ఆశా కార్యకర్తలు వరలక్ష్మీ, అపర్ణ, నాగలక్ష్మీబాయి, విజయలక్ష్మీ, జానకీ, లక్ష్మీదేవీ తదితరులున్నారు.

**నందికొట్కూరు:** ఆశా వర్కర్స్‌కు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్‌చేశారు. మంగళవారం నందికొట్కూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో సూపర్‌వైజర్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ, ఆశా వర్కర్క్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి నజీరున్నిస్సా, నాయకులు సావిత్రమ్మ, నాగస్వాములమ్మ, ఉమాదేవి, జయమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

**ఆత్మకూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** ఆర్థిక అక్షరాస్యతపై పొదుపు మహిళలకు అవగాహన కల్పించాలని డీపీఎం రంగరావు, హనుమానాయక్ సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏరియా కోఆర్డినేటర్ ఎం.పుల్లయ్య ఆధ్వర్యంలో తొమ్మిది మండలాలకు చెందిన ఎఫ్ఎల్‌సీ ఆర్‌పీలకు ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, అకౌంటెంట్లు తదితరులున్నారు.

## తెగుళ్ల నివారణపై అవగాహన

**బండిఆత్మకూరు అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):** రైతులు వరి పంటపై ఆశించిన తెగుళ్ల నివారణకు జీవశిలీంధ్ర నాశకాలు వాడాలని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం, ఏ కోడూరు గ్రామాల్లో రైతులతో కలిసి వరి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అగ్గి, కుళ్ల, ఎండా తెగుళ్ల నివారణను ఏఏ క్రిమిసంహారక మందులు ఎంత మోతాదులో పిచికారి చేయాలో రైతులకు ఏవో వివరించారు.

## ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలి

**బండిఆత్మకూరు అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):** కూలీలు పోరాటాలు చేసైనా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలని వ్యకాస జిల్లా కార్యదర్శి నరసింహా నాయక్ సూచించారు. మంగళవారం బండిఆత్మకూరులో వ్యకాస జెండాను సంఘం సీనియర్ నాయకుడు రామచంద్రుడు ఎగురవేశారు. కార్యక్రమంలో నాయకులు డేవిడ్, రత్నమయ్య, కుళ్లాయప్ప, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

## మండల మాజీ ఉపాధ్యక్షుడు మృతి

**జూపాడుబంగ్లా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** మండల మాజీ ఉపాధ్యక్షుడు వంగాల శంకరరెడ్డి (70) మంగళవారం మృతిచెందారు. సోమవారం ఇంటివద్ద ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు కర్నూలు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆయన పార్థివదేహానికి వైసీపీ రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, పెద్దలు బైరెడ్డి మల్లికార్జునరెడ్డి, వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

**జూపాడుబంగ్లా, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి):** సొంతంగా ఆదాయ వనరులను సృష్టించుకొని గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులకు, అధికారులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మిడుతూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద బైకును కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపురం గ్రామానికి చెందిన చంద్రభూషన్ అతని కుమారుడు రాజేశ్ నందికొట్కూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మిడుతూరు సమీపంలో కారు వీరి బైకును ఢీకొట్టింది. చంద్రభూషన్, రాజేష్‌కు గాయాలయ్యాయి. చంద్రభూషన్ తమ్ముడు చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఉరకుందుపై కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

## స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలి

### మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



మాట్లాడుతున్న బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

**డోన్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం కావాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. వైసీపీ పట్టణ బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్యాయత్నం

**కొలిమిగుండ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** మండలంలోని తుమ్మలపెంట గ్రామానికి చెందిన స్వాతి అనే మహిళ మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపిన వివరాలివి.. స్వాతి భర్త యేసు దాసుతోపాటు కుటుంబ సభ్యుల వేధింపులను భరించలేక ఒంటిపై టిన్నర్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీతోపాటు సీఐ రమేశ్‌బాబు సందర్శించి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలపై విచారణ జరిపారు. బాధితురాలిని కర్నూలు వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

# ఘనంగా వాల్మీకి జయంతి

**డోన్ టౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** డోన్ పట్టణంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఉన్న వాల్మీకి చిత్రపటానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి పూలమాలలు వేసి పూజలు చేశారు. ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాల్మీకి సంఘం నాయకులు వలసల రామకృష్ణ, భాస్కర్ నాయుడు, డా.మాధవ కృష్ణ, మాజీ జడ్పీటీసీ పద్మావతమ్మ, చనుగొండ్ల శ్రీనివాసులు, మిద్దెపల్లి గోవిందు, ఆర్మీ రామయ్య, అబిరెడ్డిపల్లె గోవిందు, వాల్మీకి శ్రీనివాసులు, ప్రహ్లాద, రామాం జనేయులు, మోహన్ పాల్గొన్నారు.

● పట్టణంలో ఎంఎస్ఆర్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ యువ నాయకుడు ధర్మవరం గౌతమ్ కుమార్ రెడ్డి, బేస్త సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజా వైద్యశాల మల్లికార్జునలు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం నూతనంగా బేస్త సంక్షేమ సంఘం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన ప్రజా వైద్యశాల మల్లికార్జునకు ధర్మవరం సుబ్బారెడ్డి, అనుచరులు పూలమా లతో సత్కరించారు. కార్యక్రమంలో ప్యాపిలి టీడీపీ మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, సర్పంచ్ రామిరెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సిటీ కేబుల్ కిరణ్, మండల తెలుగు యువత అధ్యక్షుడు కోనేటి కాశీ విశ్వనాథ్, నాయకులు మద్దయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

● డోన్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు సందు వెంకటరమణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండి కిరణ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. నాయకులు శివప్రకాష్, గాజుల విజయభాస్కర్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

**డోన్ రూరల్:** పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పాల్గొని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ వలంటరీ విభాగపు అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పాల్గొన్నారు.

**బనగానపల్లె:** మండలంలోని యనకండ్ల గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా విశ్వహిందూ పరిషత్, సమరసత సేవా సమితి, వాల్మీకి సంఘం పెద్దల ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

**ఉయ్యాలవాడ:** మండలంలోని కాకరవాడ గ్రామంలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. 70 వాల్మీకి కుల కుటుంబాలు ఏకమై గ్రామంలో నిర్మించిన వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామిరెడ్డి వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పించారు. ఎస్ఐని పూలమాల, శాలువతో సన్మానించారు.

**కోవెలకుంట్ల:** స్థానిక సంతపేటలోని రామాలయం వద్ద వాల్మీకి నాయకుడు ఎంవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అలాగే పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన వాల్మీకి నాయకుడు రంగడు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్లలో ఎక్కించి పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

**రుద్రవరం:** స్థానిక ఆంజనేయస్వామి ఆలయం ఆవరణలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వాల్మీకి చిత్రపటంతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వాల్మికీ సంఘం నాయకుడు ఓబులేసు, నరసింహ వార్డుమెంబరు దస్తగిరి, టీడీపీ నాయకుడు చంద్రశేఖర్, వాల్మీకులు పాల్గొన్నారు.

**ప్యాపిలి:** పట్టణంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మెట్టుపల్లి సుదర్శన్, దామోదర్‌నాయుడు, కేసీ మద్దిలేటి, నాగరాజు, బాలరంగయ్య, కేశవులు, వెంకటేశ్ పాల్గొన్నారు.

**కొలిమిగుండ్ల:** మండలంలోని అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, మీర్జాపురం తదితర గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహించారు. కొలిమిగుండ్ల సాయిబాబా గుడి వద్ద ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గోపాల్, గుజ్జల పెద్దయ్య, రమణ, రామ్మూర్తి, బీకే, కంబగిరిస్వామి, నరసింహులు ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అంకిరెడ్డిపల్లెలో వాల్మీకి సంఘం నాయకులు వాల్మీకి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.

**అవుకు:** మండలంలోని శింగనపల్లె గ్రామంలో వాల్మీకులు వాల్మీకి జయంతిని ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

**దొర్నిపాడు:** మండలంలోని దొర్నిపాడు గ్రామంలో మంగళవారం వాల్మీకి జయంతి వేడుకలను కమిటీ సభ్యులు బాల ఉసేని, ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోయ బాల ఉసేని, బాల మధు, శ్రీనివాసులు, ప్రతాప్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



డోన్‌లో వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి, ప్రజా వైద్యశాల మల్లికార్జున



బనగానపల్లెలో వాల్మీకి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీసీ ఇందిరమ్మ



ఉయ్యాలవాడ మండలం కాకరవాడలో..



కొలిమిగుండ్లలో..



## శాంతించిన వరుణుడు

**చాగలమర్రి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** చాగలమర్రి మండలంలో మంగళ వారం వరుణుడు శాంతించడంతో జలదిగ్బంధంలో ఉన్న తోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అహోబిల క్షేత్రం సమీపంలోని మఠంవారి చెరువు అలుగు పొంగి ప్రవహించడంతో సోమ వారం రాత్రి నుంచితోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో వరద నీరు ప్రవహించడంతో ఆయా గ్రామస్థులు ఎటు వెళ్లలేక గ్రామంలోనే జాగరణ చేయాల్సి వచ్చింది. వర్షం కురవకపోవడంతో వరద ముంపు నుంచి ప్రజలు బయటపడ్డారు. మండలంలోని తోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లోని వరద నీటిని తహసీల్దార్ విజయ్‌కుమార్, వీఆర్వో దాస్, డెయిరీ చైర్మన్ రమణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు ఉసేన్‌రెడ్డి, టీడీపీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

## నీట మునిగిన పంటల పరిశీలన

**చాగలమర్రి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ముత్యాలపాడు, తోడెండ్లపల్లె గ్రామాల్లో వరద నీటితో పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయని మండల ఏవో రంగనేతాజీ తెలిపారు. 'జలదిగ్బంధంలో గ్రామాలు' అన్న శీర్షిక ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. స్పందించిన ఆయన తోడెండ్లపల్లె, ముత్యాలపాడు గ్రామాల్లో నీట మునిగిన పంటలను ఏవో పరిశీలించారు. పంట నష్టాన్ని రైతులను అడిగి తెలుసుకున్నారు.

## పార్కు నిర్వహణకు వేలం

**కోవెలకుంట్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** కోవెలకుంట్లలోని కుందూనది పక్కనే ఉన్న పార్కు నిర్వహణ కోసం వేలం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో, కోవెలకుంట్ల ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు 10.9.2025 ప్రకారం ఆఫ్, సెట్, సైజ్. రూ.2.54 లక్షలు సంవత్సరం పాటు రుసుం వసూలు చేయడానికి హక్కున 10.10.2025న శుక్రవారం ఉదయం మేజరు గ్రామ పంచాయతీ కార్యాయలంలో వేలం నిర్వహిస్తామన్నారు.

## ఫ్యాక్షన్ జోలికి వెళితే చర్యలు: డీఎస్పీ

**కొలిమిగుండ్ల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** ఫ్యాక్షన్ జోలికి వెళితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఇరు పార్టీల వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీఐ రమేష్ బాబు, పాల్గొన్నారు.

## ప్రధాన న్యాయమూర్తిపై దాడియత్నం హేయం

**డోన్ రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** సుప్రీం కోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడియత్నం హేయమైన చర్య అని డోన్ కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటి అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడియత్నాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

● ప్రధాన న్యాయమూర్తికి జరిగిన దాడియత్నం దుర్మార్గపు చర్యగా సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, పట్టణ కమిటీ సభ్యుడు చిన్న రెహిమన్, ఐద్వా నాయకురాలు షమీమ్ భేగం అభివర్ణించారు. మంగళవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

**కోవెలకుంట్ల:** భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడియత్నం హేయమైన చర్య అని న్యాయవాదులు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ అధ్యక్షులు కరుణాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన రాకేశ్‌కిశోర్ న్యాయవృత్తిలో అతడు అర్హుడు కాదని భావించి న్యాయవాదిగా కొనసాగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**ప్యాపిలి:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడి చేయడం హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన స్థానికి సీపీఐ కార్యాయలంలో మాట్లాడుతూ సనాతనవాదిగా చెప్పుకుంటున్న న్యాయవాది సీజేఐపై కోర్టు ఆవరణలో ఈ ఘాతుకానికి పాల్పడడాన్ని సీపీఐ ఖండిస్తుందన్నారు. నాయకులు రాధాకృష్ణ, మహేష్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## అటవీ సంపదపై విద్యార్థులకు అవగాహన

**ఆళ్లగడ్డ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ఆహోబిలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రుద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారి ముర్తుజావలి ఆధ్వర్యంలో వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ సంపదపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రేంజర్ ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులకు హని కలిగిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం 1972 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అడవుల్లోకి ప్లాస్టిక్ వేయకూడదన్నారు. అనంతరం ఎగువ అహోబిలం ఆలయ ఆవరణంలో విద్యార్థులు, అటవీ అధికారులు మానవ హారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరమణ, ఫారెస్టు సెక్షన్ అధికారి ముక్తర్‌బాషా, ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి, ఎఫ్‌బీఓ నాగ హుసేనయ్య, జేమ్స్ పాల్, నరసింహారెడ్డి, మదన్‌గోపాల్, ప్రొటెక్షన్ వాచర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.